సురక్షతో పేదలకు మెరుగైన వైద్య సేవలు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిరంతరంగా వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ చెరుకూరి పార్వతీదేవి బుధవారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు పరిశీలించారు. వృద్ధులకు మందులు అందజేశారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు బాలం రమేష్, ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరతపూడిలో...

అంబాజీపేట: చిరతపూడిలో తహసీల్దార్ టి.మంగతాయారు పర్యవేక్షణలో సర్పంచ్ కోట బేబిరాణి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో 480 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, చిట్టిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్.గన్నవరంలో..

పి.గన్నవరం: రాష్ట్రంలో ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఎల్.గన్నవరం-1 గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు 256 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని వివరించారు. సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు మానుకొండ ప్రసాద్, చిట్టాల అర్యశ్రీను, యన్నాబత్తుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పాశర్లపూడిలంకలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



మడికిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శివకోడులో..

రాజోలు: శివకోడు గ్రామ సచివాలయం-2 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ నక్కా రామారావు ప్రారంభించారు. శిబిరంలో ఆరోగ్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పరిషత్ ఏఓ ఎం.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టా ఏడుకొండలు, గ్రామశాఖ అధ్యక్షుడు పితాని నాగరాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మీమౌనిక అన్నారు. మడికి గ్రామ సచివాయం-2 పరిధిలో తహసీల్దార్ ఐవీ శెట్టి, ఎంపీడీవో కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు జరిగింది. ఈ శిబిరంలో 356 మందికి పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన 27 రకాల పౌష్టికాహార వంటకాలు, పండ్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పంచాయతీ ఈఓ కె.మోక్షంజలి, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.జ్యోతి కుమార్, ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు

దేవరపల్లి-2లో..

రావులపాలెం: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దేవరపల్లి-2 గ్రామ సచివాలయ పరిధిలో గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు 515 మందికి రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ అప్పారి విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సుభాష్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరిపల్లి గ్రామంలో...

అయినవిల్లి: సిరిపల్లి గ్రామంలో సర్పంచ్ కుడుపూడి శాంతావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 516 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ సభ్యురాలు గన్నవరపు శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యులు మంగాదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి అందజేత



చిరతపూడిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: చిరతపూడిలో సర్పంచ్ కోట బేబిరాణి అధ్యక్షతన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దార్లంక ఆకాంక్షకు రూ.2 లక్షలు, కొడమంచిలి పుష్పావతికి రూ.30 వేలు చెక్కులను అందజేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో మొక్కల పెంపకం

మామిడికుదురు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కొబ్బరి మొక్కల పెంపకం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. లూటుకుర్రు గ్రామంలో పంచాయతీ ఆవరణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కొబ్బరి మొక్కల పెంపకం పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. వార్డు సభ్యుడు బోణం అబ్బులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు: అనారోగ్యంతో మృతి చెందిన ఆదుర్రు మాజీ సర్పంచ్ దాకే సుభాష్‌చంద్రబోస్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి బుధవారం పరామర్శించారు. సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఆదుర్రు సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు తదితరులు మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: విజయ దశమి సందర్భంగా పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తాటికాయల దేవి, మధుబాబు దంపతులు సమకూర్చిన 100 చీరలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మహిళలకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు పెచ్చెట్టి రాంబాబు, కుడుపూడి రాము, బోడపాటి సాయిబాబు, అడ్డాల శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడిని దర్శించిన చీఫ్ ఇంజినీర్



విఘ్నేశ్వరుని సన్నిధిలో దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో దేవదాయ శాఖ సాంకేతిక విభాగం రాష్ట్ర అధిపతి(చీఫ్ ఇంజినీర్) సుసర్ల శ్రీనివాసరావు సతీ సమేతంగా స్వామివారిని బుధవారం దర్శించి. ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం చైర్మన్ నాగబాబు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. అనతరం ఇటీవల అన్నప్రసాద భవనం నిర్మాణానికి కొనుగోలు చేసిన స్థలం వినాయక సదన్ అభివృద్ధి పనులను శ్రీనివాసరావు పరిశీలించారు.

చంద్రబాబు అరెస్టును ప్రజలు స్వాగతించారు

మలికిపురం: అవినీతి కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును తెలుగురాష్ట్రాల ప్రజలు సాదారంగా స్వాగతించారని వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు గుండుమేను శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. టీడీపీలో ఇష్టానుసారం రాష్ట్ర దోపిడీకి పాల్పడిన నాయకుల తరపున చంద్రబాబు భార్య భువనేశ్వరి ఏమని ప్రజల్లోనికి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఇన్నాళ్ళకు దొంగలు దరికారని ప్రజలు భావిస్తున్నారని యాదవ్ అన్నారు.

'నామట్టి-నాదేశం' కార్యక్రమం

పి.గన్నవరం: కాకినాడ నెహ్రూ యువకేంద్రం, నవభారత్ యువ నిర్మాణ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పి.గన్నవరం బ్లాక్ స్థాయిలో నామట్టి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సేకరించిన మట్టిని అమృత కలశాల్లో ఉంచి ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ పాలూరి వీరభద్రరావు, ఎంపీడీఓ ఎం.భారతి, ఎన్‌టీవైఎస్.అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఎన్‌టీవైఎస్ గౌరవాధ్యక్షుడు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జగనన్నకు చెబుదాం'

ఆత్రేయపురం: మండల కేంద్రం ఆత్రేయపురం మహరాజా ప్యాలెస్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి ఎం.ప్రభాకరరావు ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ నాతిబుజ్జి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి అధికారులతో కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అర్జీదారులు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో స్వయంగా హాజరై వారి సమస్యను దరఖాస్తు ద్వారా తెలియజేయాలన్నారు. అనంతరం జగనన్నకు చెబుదాం నిర్వహించే ప్రాంగాణాన్ని ఆమె అధికారులతో పరిశీలించారు.

దుప్పట్ల పంపిణీ

మలికిపురం: టేకిశెట్టిపాలెం గ్రామానికి చెందిన సుమారు 40 నిరుపేద కుటుంబాలకు వారధి ఫౌండేషన్ సమకూర్చిన షోలాపూర్ దుప్పట్లను సఖినేటిపల్లి మాజీ ఎంపీపీ లింగోలు చిన్నబ్బులు పంపిణీ చేశారు. ఆహార పొట్లాలనూ పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు శృంగారపు గంగాధర రామారావు, కర్రా మల్లికార్జున రావు, ముద్దల వెంకటేశ్వరరావు, ఆచంట శ్రీనివాస్, పెద్దబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారం ప్రారంభం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న పార్వతీ రాజేశ్వరిస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామివారి ముఖ ద్వారాన్ని బుధవారం ప్రారంభించారు. మాచవరం-అవిడి వెళ్లే ప్రధాన రహదారిలో స్వామివారి ముఖ ద్వారాన్ని అప్పన వెంకటరాజు కుటుంబీకులు నిర్మించినట్టు ఆలయ అర్చకులు సూర్యనారాయణ, గ్రామస్తులు తెలిపారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎంగా జగన్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- అంతర్వేదిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

మలికిపురం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజాభీష్టం మేరకు మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం అంతర్వేదిపాలెంలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించి, పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం వారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ పేదలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయం తథ్యమన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు ఈద రవిరెడ్డి, నల్లి సురేంద్రరావు, మాజీ ఉపసర్పంచ్ నల్లి త్రిమూర్తులు, నాయకులు గెద్దం అమ్ములు, కోనపల్లి వెంకటేశ్వరరావు, మందపాటి సత్యనారాయణ, మోకా ఏసురాజు, పసలపూడి భగవాన్, కె.అశోక్, చింతా రాజబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంతర్వేదిపాలెంలో పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

బాలాజీ సన్నిధిలో హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్



చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టీలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టీ సత్తిబాబు

మామిడికుదురు: రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ ఎం.సీతారామమూర్తి కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్న అనంతరం చైర్మన్ సీతారామమూర్తికి అర్చకులు స్వామివారి వేదాశీర్వచనం అందించారు. స్వామివారి శేషవస్త్రం బహూకరించి, చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ట్రస్టీలు కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, ఉద్యోగులుపాల్గొన్నారు.

28న ఆలయం మూసివేత

మామిడికుదురు: పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 28వ తేదీ శనివారం అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ జి.మాధవి బుధవారం తెలిపారు. 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి ఆలయాన్ని మూసి వేసి, ఆలయ సంప్రోక్షణ, సేవల అనంతరం 29న తెరుస్తామని ఆమె చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి యథావిధిగా భక్తుల దర్శనాలు కొనసాగుతాయన్నారు.

రూ.10,116 విరాళం

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన దొమ్మేటి నరేంద్రమోహన్, నాగలక్ష్మి దంపతులు బుధవారం రూ.10,116 విరాళంగా సమర్పించారు. వారికి ఆలయ ట్రస్టీ చిట్టాల సత్తిబాబు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు.

హత్యాయత్నంపై కేసు

ఆత్రేయపురం: బొబ్బర్లంక గ్రామానికి చెందిన బత్తుల ప్రేమజ్యోతిపై ఆమె భర్త బత్తుల గంటయ్య హత్యాయత్నం చేసినట్టు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల ప్రేమజ్యోతికి ఉండి మండలం ఆరేడు గ్రామానికి చెందిన బత్తుల గంటయ్యతో 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. బత్తుల గంటయ్య డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సుమారు నాలుగు నెలల నుంచి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతో ప్రేమజ్యోతి అమ్మగారి ఇంటికి వచ్చేసింది. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో ఉంచిన వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇదిలా ఉండగా సుమారు వారం రోజుల క్రితం గంటయ్య బొబ్బర్లంక వచ్చి కాపురం సరిగ్గా చేసుకుంటానని చెప్పి బొబ్బర్లంక గ్రామంలోనే భార్యతో ఉంటున్నాడు. బుధవారం తెల్లవారు జామున సుమారు రెండు గంటలకు భార్యతో వాగ్వివాదం పెట్టుకుని ఆమె గొంతుపై చాకుతో కోసి పారిపోయాడు. దీంతో ప్రేమ జ్యోతిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ప్రేమజ్యోతి మరిది కుశమే నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుర్గమ్మ ఊరేగింపు

ఆత్రేయపురం: శరన్నరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం మండలంలోని వాడపల్లి, పేరవరం, ఉచ్చిలి, రాజవరం, ఆత్రేయపురం తదితర గ్రామాల్లో విజయదుర్గాదేవి ఆలయం వద్ద భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆత్రేయపురంలో కనకమహలక్ష్మి, శ్రీమల్లమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. లొల్ల లాకుల వద్ద విజయకనక దుర్గాదేవి, స్థానిక ధ్యాన మందిరం కనకదుర్గాదేవి ఆలయాల వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారి విగ్రహాలకు బ్యాండ్, తీన్మార్, సన్నాయి వాయిద్యాల మధ్య వాహనాలపై భారీ ఊరేగింపు నిర్వహించి జొన్నాడ గౌతమీ గోదావరి తీరంలో నిమజ్జనం చేశారు.

అంబాజీపేట: మండలంలో పలు దుర్గమ్మ ఆలయాల వద్ద బుధవారం అన్నసమారాధనలు, లడ్డూవేలం పాటలు నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారం బాడవపట్టివారిపాలెంలో విజయదుర్గ అమ్మవారి 14వ వార్షికోత్సవాన్ని శ్రీవిజయ దుర్గ కమిటీ ఫ్రెండ్స్ సర్కిల్, శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాకలగరువులోను, గంగలకుర్రులోను అన్నసమారాధనలు చేపట్టారు. అంతకు ముందు దుర్గమ్మ కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై ఊరేగించారు. పి.గన్నవరం, జి.పెదపూడి తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ముగిశాయి.



ఉచ్చిలిలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

విశ్వరూప పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

రావులపాలెం: ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న విశ్వరూప పాదయాత్ర, సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం రావులపాలెంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో సభ్యులు ఆవిష్కరించారు. కొత్తపేట నియోజకవర్గ మాదిగల ప్రతినిధి కొల్లి శ్యామ్సన్, సభ్యులు, నేకూరి రాజేష్, వంగలపూడి బాబురావు, చదలవాడ మసేను, ఉండ్రాజవరపు సుందర్ విజయన్, యోహాను తదితరులు కరపత్రాన్ని ఆవిష్కరించి కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి వీర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కుడెల్లి సురేష్ బాబు, జాయింట్ సెక్రటరీ తాతపూడి అబ్బులు,ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమల్ల సుధాకర్, కార్యదర్శులు బూర సర్వారాయుడు ,బుంగ ఉదయ్ కుమార్ ,కొల్లి కృష్ణలకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఈఎఫ్ నాయకులు లంక రవి, ఉండ్రాజవరపు ప్రసాద్ ,తాతపూడి వాసు ,పిప్పార ప్రసాద్, గరిటయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప పాదయాత్ర ప్రారంభం

ఆలమూరు: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల కేంద్రమైన ఆలమూరులో ఆ సంఘ ఉపాధ్యాక్షుడు కొమ్ము నారాయుడు విశ్వరూప పాదయాత్రను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఈ పాదయాత్రలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మాదిగ, ఉప కులాల నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే స్పందించి ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలకాలని ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ తాతపూడి అబ్బులు, బుంగ ఉదయ్ కుమార్, కొమ్మర సత్తిబాబు, లంక రవి, పెందుర్తి యాకోబు,పెందుర్తి వెంకటేష్, కుడెల్లి సూరిబాబు, ఉండ్రాజ వరపు ప్రసాద్, తాతపూడి వాసు,లంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌బాబు సేవలు మరువలేం



పెదపళ్లలో వైద్యాధికారి సుదర్శన్‌బాబును సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: కోవిడ్-19 వంటి విపత్కర పరిస్థితుల్లో పెదపళ్ల పీహెచ్‌సీ అధికారిగా ఆర్.సుదర్శన్‌బాబు అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకర రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కార్యాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం సర్పంచ్ యేడిద సత్యశ్రీ అధ్యక్షతన వైద్యాధికారి సుదర్శన్‌బాబు అభినందన సభ జరిగింది. వైద్యాధికారిగా పని చేసిన ఆయన ఉన్నత విద్య(ఎంఎస్) శిక్షణ కోసం ఎంపిక కావడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం సుదర్శన్‌బాబు దంపతులను పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లు కట్టా శ్రీనివాసు, తోట భవాని, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ.రాజా, ఎల్‌టీ ఆర్.రాజా రమేష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, నడింపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

అంబాజీపేట: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయాలని జోన్-2 ఇన్‌చార్జి మందలపు రవి అన్నారు. అంబాజీపేట వెంకట్రాజు ఆయిల్ మిల్ల్ వద్ద టీడీపీ పార్టీ నియోకవర్గ స్థాయి సమావేశం బుధవారం జరిగింది. పార్టీ ఆదేశాలను అనుసరించి పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల సేవలు అభినందనీయం

మలికిపురం: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నియోజకవర్గ వాసులకు కువైట్ కేంద్రంగా ఆదర్శ ఆంధ్ర యూత్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం గొల్లపాలెం గ్రామానికి చెందిన జిల్లెల్ల ఐశ్వర్యరాణికి నెలలు నిండకముందే జన్మించిన చిన్నారి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆదర్శ ఆంధ్ర యూత్ అందించిన ఆర్థిక సహాయం రూ.10 వేలను ఎమ్మెల్యే రాపాక చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ వ్యవస్థాపకక అధ్యక్షులు ఇంజేటి కృష్ణ కుమార్, కొల్లాబత్తుల అశోక్, తాడి సహదేవ్, గుండుమేను నారాయణ మూర్తి, పితాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పి.గన్నవరం: ఊడిమూడి గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఊడిమూడి గ్రామానికి చెందిన కొల్లు దుర్గరాజు(26)కు గతంలో వివాహం జరిగింది. ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఇటీవల భార్య, భర్తల మధ్య మనస్పర్థల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి దుర్గరాజు మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం అతడు ఊడిమూడి గోదావరి గట్టుకు వెళ్లి పురుగుల మందు సేవించాడు. అనంతరం చినాన్న గోవిందు సెల్‌కు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్టు దుర్గరాజు చెప్పాడు. దీంతో గోవిందు, తాతయ్య కొల్లు సుబ్బారావు ఏటిగట్టు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే దుర్గరాజు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతడిని తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి, అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతదేహానికి అదే ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని తాత సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు బొమ్మిడి నాగరాజు కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బుధవారం చేయూతనిచ్చింది. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల సొసైటీల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా సాయం చేశారు. టార్పలిన్, వంటసామగ్రి, ఐజెనిక్ కిట్ ఆయన అందజేశారు. వ్యక్తిగతంగా రూ.వెయ్యి నగదును ఇచ్చారు. జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబర్ బోణం రాజు, జిల్లా లైఫ్ మెంబర్లు ఉయ్యూరు రంగరాజు, అటారం మాష్టారు, తాడి సహదేవ్, రెడ్‌క్రాస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ ప్రసాద్, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రచార మహోత్సవం

రావులపాలెం: ఏపీఎస్ఆర్‌టీసీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవంలో భాగంగా గురువారం నుంచి వచ్చే నెల 25 వరకూ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం నిర్వహిస్తున్నట్టు రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ బుధవారం తెలిపారు. పార్సిల్ డోర్ డెలివరీ సౌకర్యాన్ని వినియోగదారులు అందరూ మరింతగా వినియోగించు కోవాలన్నారు. అలాగే ముఖ్య కూడళ్లల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు, పోస్టర్లతో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు.



రావులపాలెం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నేటి నుంచి ఇసుక మేటల తొలగింపు పనులు

ఆత్రేయపురం: గోదావరిలో ఇసుక మేటల తొలగింపులో భాగంగా గురువారం నుంచి 28వ తేదీ వరకూ ధవళేశ్వరం బ్యారేజీ స్కవర్ స్లూయిజ్ ద్వారా నీరు విడుదల చేయనున్నట్టు గోదావరి హెడ్ వర్క్స్ జేఈ సాయిరామ్ తెలిపారు. బుధవారం ధవళేశ్వరం బ్యారేజీని సందర్శించి స్కవర్‌స్లూయిజ్ గేట్లను పరిశీలించారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఏటా ఇసుక మేటలు తొలగించేందుకు స్కవర్ స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో నీరు విడుదల చేసి ఇసుక మేట్లు తొలగించామన్నారు. 26న వెస్ట్రన్, 27న సెంట్రల్ డెల్టా, 28న ఈస్ట్రన్ డెల్టా గేట్లు తెరచి సాగు నీటిని విడుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ గేట్లు తెరవడంతో గోదావరిలో ఇసుక మేట్లు తొలగిపోయి ఉభయ గోదావరి జిల్లాల్లోని పంట పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుందని వివరించారు.

28న క్రీడాకారుల ఎంపికలు

కొత్తపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన కొత్తపేటలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి తెలిపారు. బుధవారం వారు స్థానిక ఎంఆర్‌సీలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక కాంతిభారతి హైస్కూలు ఆవరణలో నిర్వహించే షూటింగ్ బాల్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగాలలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆ రోజు ఉదయం 9 గంటలకు స్థానిక కాంతిభారతి హైస్కూలులో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.